నేడు భూ భారతి చట్టంపై అవగాహన

మణికొండ: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన భూ భారతి చట్టం–2025పై ప్రజలు, రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని గురువారం ఖానాపూర్ రైతువేదికలో నిర్వహించనున్నట్టు గండిపేట తహసీల్దార్ ఎస్. శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డిలు పాల్గొంటారన్నారు. రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: పారిశుద్ధ్య పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ బండ్లగూడను పరిశుభ్రంగా ఉంటేందుకు.. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 5వ డివిజన్‌లోని కపిలనగర్ కాలనీలో భూగర్భ డ్రైనేజీలను శుభ్రం చేసే ప్రక్రియను ఆయన పరిశీలించారు. బండ్లగూడ జాగీర్‌లో సాంకేతిక పరిజ్ఞానం ఉన్న ఆపరేటర్స్‌తో మేకనైస్డ్ అండర్ డ్రైనేజీ క్లినింగ్ మాత్రమే జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ జవాన్లు వెంకటేష్, రాము పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి

మణికొండ: దేశానికి స్వాతంత్రం తేవటంతో పాటు మేధావులతో రాజ్యాంగాన్ని రచింపచేసి దేశపౌరులంతా దాని ప్రకారం జీవించేలా చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదని, అలాంటి రాజ్యాంగానికి తూట్లు పొడిచే పనులను బీజేపీ చేపడుతుందని, దాన్ని అడ్డుకుని రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని కాంగ్రెస్ పార్టీ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్ అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట జై బాపు, జై భీం, జై సంవిదాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఎక్కడా లేని విధంగా సన్నబియ్యం, మహిళలకు ఉచిత బస్సు, 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్, బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ అమలు లాంటి చారిత్రాత్మక నిర్ణయాలు, పథకాలను తెచ్చిందన్నారు. రాజ్యాంగ ప్రతులతో ర్యాలీ నిర్వహించారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ టి.మల్లేష్‌ముదిరాజ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ కె.వేణుగౌడ్, మాజీ కౌన్సిలర్‌లు జి.శివారెడ్డి, దుర్గేష్‌యాదవ్, మాజీ ఉపసర్పంచ్ యాదగిరి, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు, నాయకులు పాల్గొన్నారు.

'రాజపుష్ప'లో అగ్ని ప్రమాదం

మణికొండ: మై హోం అవతార్ పక్కన నిర్మాణంలో ఉన్న రాజుపుష్ప ప్రావిన్సియాలో బుధవారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. ఒక్కసారిగా పెద్ద ఎత్తున నల్లని పొగలు రావటంతో అప్రమత్తం అయిన సిబ్బంది వెంటనే అగ్నిమాపక శాఖ వారికి ఫిర్యాదు చేశారు. వారు అక్కడకు చేరుకుని ఓ అంతస్తులో విద్యుత్ వైర్లకు వచ్చిన మంటలను ఆప్పి వేశారు. భవనంలో నుంచి దట్టమైన పొగ వస్తుండటంతో ఔటర్ సర్వీసు రోడ్డులో వెళ్లే వాహనదారులు ఆపి చూసే ప్రయత్నం చేయటంతో ట్రాఫిక్ జాం అయ్యింది.

పీవీ నర్సింహారావు ఫ్లైఓవర్‌పై కారు బోల్తా

మైలార్‌దేవ్‌పల్లి: పి.వి.నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వే పై బుధవారం మధ్యాహ్నం ఓ కారు వేగంగా దూసుకువచ్చి అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ సంఘటనలో కారులో ఉన్న ముగ్గురికి ఎలాంటి గాయాలు కాలేదు. ఈ సంఘటనతో పి.వి.నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ వేపై ట్రాఫిక్‌కు గంటపాటు అంతరాయం ఏర్పడింది. మెహిదీపట్నం నుంచి శంషాబాద్ వెళ్తున్న కారు వేగంగా దూసుకొచ్చి పిల్లర్ నెంబర్ 151 వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. అనంతరం పల్టీ కొట్టి రోడ్డుపై రాసుకుంటూ వెళ్లింది. ఈ సంఘటన జరిగిన సమయంలో కారులో ముగ్గురు యువకులు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. కారులోని ముగ్గురు యవకులకు ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదని... ప్రమాదం జరిగిన వెంటనే వారు కారు దిగి వెళ్లిపోయారని స్థానికులు, పోలీసులకు సమాచారం అందించారు. కారు బోల్తాపడటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసలు సంఘటన స్థలానికి చేరుకొని కారును స్టేషన్‌కు తరలించారు. ఈ సంఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని రాజేంద్రనగర్ పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

మైలార్‌దేవ్‌పల్లి: ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... బీహార్ రాష్ట్రానికి చెందిన టింకు కుమార్(31) భార్య, పిల్లలతో కలిసి టీఎన్‌జీవోస్ కాలనీలో ఉంటూ కార్మికుడిగా పని చేస్తున్నాడు. మద్యానికి అలవాటుపడి ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. తల్లికి ఫోన్ చేసి తాను చనిపోతున్నానని చెప్పి ఆత్మహత్యకు పాల్పడ్డాడు

ఉగ్రదాడిపై ప్రజాగ్రహం

- వాడవాడలా కొవ్వొత్తులతో నివాళులర్పించిన ప్రజానీకం
- ఉగ్రమూకలను ఏరివేయాలని డిమాండ్
- మణికొండ, నార్సింగిలతో నిరసన ర్యాలీలు

మణికొండ: కాశ్మీర్ అందాలను చూసేందుకు వెళ్లిన పర్యాటకులను ఉగ్రమూకలు మంగళవారం పహల్గాంలో కాల్పులు జరిపి 28మంది మృతికి కారకులయిన వారికి సరైన బుద్ధి చెప్పాలని మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల ప్రజలు డిమాండ్ చేశారు. బుధవారం మణికొండ మున్సిపాలిటీ అలకాపూర్ టౌన్‌షిప్‌లో పార్టీలకు అతీతంగా, మణికొండ మర్రిచెట్టు సర్కిల్‌లో బీజేపీ ఆధ్వర్యంలో, నార్సింగి మున్సిపాలిటీ కోకాపేటలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీలు నిర్వహి ంచి మృతులకు మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మణికొండ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కె. నరేందర్‌ముదిరాజ్, వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజన్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్ మాట్లాడుతూ... కాశ్మీర్‌లో పర్యాటకాన్ని పెంచి స్థానికులకు ఉపాధి అవకాశాలు పెంచుతున్న తరుణంలో ఇలాంటి దారుణానికి పాల్పడటం అవివేకమన్నారు. మరో సారి సర్జికల్ స్ట్రైక్ నిర్వహించి ఇలాంటి ఉగ్రవాదుల మూలాలు లేకుండా చేయాలన్నారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ టి.మల్లేష్‌ముదిరాజ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ కె. వేణుగౌడ్, నార్సింగి మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ విజయ్‌బాబు, మణికొండ మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు జితేందర్, బీజేపీ అధ్యక్షుడు బి. రవికాంత్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్‌లు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆరాంఘర్ చౌరస్తాలో...

మైలార్‌దేవ్‌పల్లి: ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తూ ఆరాంఘర్ చౌరస్తాలో రాజేంద్రనగర్ సర్కిల్ బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ మల్లేష్‌యాదవ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని నాయకులతో కలిసి పాకిస్తాన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఉగ్రదాడిలో భారతమాత ఒడిలో చేరిన, గాయపడిన వారి ఆత్మశాంతి చేకూరాలని కొవ్వొత్తులతో నిరసన తెలియజేశారు. ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొమురయ్య, కోరని దయానంద్, భీమార్జున్‌రెడ్డి, మహాలింగంగౌడ్, ఎస్.విజయ్‌కుమార్, కాడెం సుధాకర్, జోగి రవి, రాచూరి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మైలార్‌దేవ్‌పల్లిలో నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తదితరులు

మైలార్‌దేవ్‌పల్లిలో...

ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ పాల్గొని మరణించిన వారి ఆత్మకు శాంతి ప్రసాదించాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. అనంతరం నిర్వహించిన కొవ్వత్తుల ర్యాలీలో పాల్గొన్నారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఎన్.ధనుంజయ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడి హేయం

శంషాబాద్ రూరల్: జమ్ము కశ్మీర్‌లోని పహల్గాలో అమాయక ప్రజలపై ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య అని నార్సింగి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎ.శ్రీకాంత్‌గౌడ్ అభివర్ణించారు. బుధవారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ.. ఉగ్రవాదుల చర్యలు క్షమించరాని నేరమన్నారు. అమాయక పర్యాటకులను పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులకు తగిన శిక్ష వేయాలన్నారు. ఇలాంటి ఘటలను పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలన్నారు.



నివాళులర్పిస్తున్న మహిళలు



డైరీఫామ్ చౌరస్తా వద్ద...

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్‌లో క్యాండిల్ ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు. డైరీఫామ్ చౌరస్తా వద్ద ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రదర్శన, నిరసన కార్యక్రమాలతో పాటు క్యాండిల్స్‌ను చేతపట్టుకొని ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వం చనిపోయిన కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.



కోకాపేటలో కాంగ్రెస్ నాయకులు



మణికొండ అలకాపూర్ టౌన్‌షిప్‌లో...



మణికొండ మర్రిచెట్టు సర్కిల్‌లో బీజేపీ నాయకులు



ఆరాంఘర్ చౌరస్తాలో పాకిస్థాన్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నేతలు

మేడే పోస్టర్ ఆవిష్కరణ

- మే 20న దేశవ్యాప్త సమ్మె
- విజయవంతం చేయాలి: సీఐటీయూ



కాటేదాన్‌లో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నేతలు

మైలార్‌దేవ్‌పల్లి: కార్మిక దినోత్సవం మే డే వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను సీఐటీయూ నాయకులు బుధవారం ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు జాజాల రుద్రకుమార్ మాట్లాడుతూ... మండల పరిధిలోని ప్రతి డివిజన్ కేంద్రంలోని అడ్డాల వద్ద సీఐటీయూ జెండాలను ఎగరవేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎనిమిది గంటల పనిదినాన్ని అమలు చేయకుండా 12 గంటలు యజమానులకు అనుకూలంగా చట్టాలను తీసుకువచ్చిందన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు చేయాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును కేంద్ర ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. నాలుగు లేబర్ కోర్డులను అమలులోకి తెచ్చి కార్మికులను ముప్పుతిప్పలు పెడుతుందన్నారు. ఒక వైపు నిత్యావసర సరుకుల ధరలు పెంచుతూ మరో వైపు కార్మికుల చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకొచ్చి కార్మికుల నడ్డి విరగగొడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా మే 20వ తేదీన దేశవ్యాప్తంగా సమ్మె చేపడుతున్నామన్నారు. సీఐటీయూ కాటేదాన్ క్లస్టర్ పారిశ్రామిక కోశాధికారి పి.సి.కె.భాస్కర్, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కార్యదర్శి వెంకటయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు బజ్జలకూర స్వామి, నేతలు రమేష్, శివ, రాంచందర్, చంద్రకళ, శైలజ, లక్ష్మమ్మ, రమా, ఉమా, వేణు, ప్రమీల, అశోక్, యాదమ్మ, ప్రవీణ్, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

'ఐలా' కార్మికుల సమస్యలపై సీఐటీయూ ధర్నా

మైలార్‌దేవ్‌పల్లి: కాటేదాన్ ఇండస్ట్రీ ఐలా కార్మికుల సమస్యల పరిష్కారించాలని కాటేదాన్ ఇండస్ట్రియల్ కమిషనర్ ఆఫీసు ముందు బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు జాజాల రుద్రకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్మికులకు వేతనాలను చెల్లించాలని ప్లకార్డులు ప్రదర్శిస్తు నిరసన తెలిపామన్నారు. కార్యాలయంలో కమిషనర్‌తో పాటు అధికారులు ఎవరు అందుబాటులో ఉండడం లేదన్నారు. ధర్నా నిర్వహించి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సిబ్బందికి అందించామన్నారు. ఆయన మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా కార్మికులు పని చేస్తున్నారని శానిటేషన్ ఇండస్ట్రియల్ ఐలా కార్మికులు గత రెండు నెలల కాలం నుంచి వేతనాలు చెల్లించడం లేదన్నారు. కుషాయిగూడ, నాచారం, చర్లపల్లి, మౌలాలి తదితర ప్రాంతాల్లో కార్మికులకు 19600 వేతనాలు చెల్లిస్తున్నారని అదే విధంగా ఇక్కడ పని చేస్తున్న కార్మికులకు కూడా అందించాలన్నారు. కార్మికులందరిని బట్టలు, చీపుర్లు, కట్టెలు, చెప్పులు, షూ, గ్లౌజ్‌లు ఇతర సేఫ్టీ పరికరాలు 30 రోజులకు సరిపడి అందించి ప్రతి నెల సమకూర్చాలన్నారు. వారం, పది రోజుల్లో కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ కాటేదాన్ ఇండస్ట్రియల్ ఏరియా కన్వీనర్ పి.సి.కె.భాస్కర్, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కార్యదర్శి వెంకటయ్య, ఆర్.రమేష్, కార్మికులు బాబు, చంద్రకళ, రామచందర్, శైలజ, లక్ష్మమ్మ, రమ, ఉమా, వేణు, ప్రమీల, అశోక్, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నేతలు

బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి



బూర్కుంట సతీష్, డీసీసీబీ డైరెక్టర్

శంషాబాద్ రూరల్: వరంగల్‌లో ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని డీసీసీబీ డైరెక్టర్ బూర్కుంట సతీష్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన మాట్లాడుతూ... వరంగల్‌లో నిర్వహించే ఈ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. స్థానిక ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్ పార్టీ గెలుపును ఎవరూ ఆపలేరని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలం అయిందని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా గ్రామాల్లో పాలనను గాలికొదిలేసిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కేసీఆర్ నాయకత్వంలో పార్టీ మరోసారి రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందన్నారు.

విద్యార్థులకు క్రీడల్లోనూ ప్రోత్సాహం



మారుతిని అభినందిస్తున్న కళాశాల కార్యదర్శి సురేందర్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: విద్యార్థులను చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహిస్తున్నామని మహవీర్ గ్రూప్ ఆఫ్ కళాశాల కార్యదర్శి సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. కళాశాలలో బీటెక్ కంప్యూటర్ సైన్స్ మొదటి సంవత్సరం చదువుతున్న కొప్పుల మారుతి అంతర్జాతీయ క్రికెట్ పోటీలకు అండర్–23కి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో ఆ విద్యార్థిని అభినందించారు. అనంతరం కళాశాల కార్యదర్శి సంరెడ్డి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ... నేపాల్‌లో మే 26వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జరగనున్న అంతర్జాతీయ క్రికెట్ పోటీల్లో ఆల్ రౌండర్ కేటగిరీలో ప్రాతినిధ్యం వహించనున్నాడన్నారు. విద్యార్థికి కావాల్సిన అన్ని రవాణా, ఇతర ఖర్చులను కళాశాల స్పాన్సర్ చేస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రటరీ సంరెడ్డి ధనుంజయ్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, డాక్టర్ వి.ఉషశ్రీ, సి.హెచ్.సైదులు, డాక్టర్ సరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

శంషాబాద్ రూరల్: పిల్లోనిగూడ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారుల తల్లిదండ్రులకు పిల్లల అభివృద్ధి పరిశీలన కార్డులపై అవగాహన కల్పించారు. అనంతరం పిల్లలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్ఞానేశ్వరి, పంచాయతీ కార్యదర్శి పండరీనాథ్, అంగన్‌వాడీ టీచర్లు జె.అనిత, కె.పద్మజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

మణికొండ: జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే ప్రస్తుత సమాజంలో విద్యతోనే సాధ్యమని, దాన్ని పొందేందుకు ఇష్టంగా కృషి చేయాలని మణికొండ మున్సిపల్ మాజీ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్ అన్నారు. అన్ని తరగతుల విద్యార్థులకు పరీక్షలు ముగియటంతో పుప్పాలగూడ ప్రాథమిక పాఠశాలలో ఆయన విద్యార్థులకు మార్కుల పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సౌకర్యాలను పెంచుతున్నామన్నారు. ప్రభుత్వ నిధులతో పాటు పలు సేవా, ఐటీ సంస్థలు ముందుకు వచ్చి పాఠశాలలను తీర్చిదిద్దుతున్నారన్నారు. వాటన్నింటినీ సద్వినియోగం చేసుకుని ఉన్నత చదువులను చదువుకునేందుకు బాటలు వేసుకోవాలన్నారు. మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాజీ కౌన్సిలర్ కె.రామకృష్ణారెడ్డి విద్యార్థులకు మార్కుల పత్రాలను అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు నిరంజన్, మాంగ్యానాయక్, నాయకులు బి. శ్రీరాములు, కె. లక్ష్మీనారాయణ, కిరణ్‌కుమార్, కుమార్ పాల్గొన్నారు.



మణికొండలో మార్కుల పత్రాలు అందుకున్న విద్యార్థులతో నాయకులు, ఉపాధ్యాయులు



పుప్పాలగూడలో మార్కుల పత్రాలు అందజేస్తున్న మాజీ చైర్మన్ నరేందర్

బయోమెట్రిక్ విధానాన్ని రద్దు చేయాలి



నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

శంషాబాద్: భవన నిర్మాణ కార్మికులకు సంబంధించిన సంక్షేమ పథకాలకు బయోమెట్రిక్ విధానాన్ని రద్దు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎం.నరసింహా డిమాండ్ చేశారు. నిర్మాణ రంగంలోని కార్మికులకు ప్రతి విషయంలో బయోమెట్రిక్ విధానం ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మహాసభల తీర్మానాల్లో దీనిని ప్రవేశపెట్టినట్లు బుధవారం వెల్లడించారు. లేబర్ అడ్డాల వద్ద మౌలిక వసతుల ఏర్పాటు, కార్మికులందరికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పక్కా ఇల్లు, మృతుల కుటుంబాల పరిహారం రూ. 6 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేస్తూ తీర్మానం చేశామన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 75 ఏర్పాటు చేసిన నూతన కమిటీలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా మారగోని ప్రవీణ్‌కుమార్, కార్య నిర్వాక అధ్యక్షుడిగా గన్నారం రమేష్, ప్రధాన కార్యదర్శిగా పల్లా దేవేందర్‌రెడి నియమించారు.రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికనై శంషాబాద్ వాసులు నర్రగిరి, అన్నెపు ప్రభులు నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను సన్మానించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు, రాష్ట్ర కార్యదర్శులు యాదగిరి, మల్లికార్జున్, సామిడి శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటిన 'శ్రీఅభిద' విద్యార్థులు

అత్తాపూర్: అత్తాపూర్‌లోని శ్రీ అభిద జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో అసాధారణ విజయాలు సాధించి సత్తాచాటారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు, డీన్ రవికుమార్, ప్రిన్సిపాల్, నర్సింహారావు, భార్గవి దేశ్‌పాండే అభినందించారు. ఎంపీసీలో గైని యశశ్విని, అనుగుండ రిషికారెడ్డి, మోతుకూరి సంజన, సావంత్ ఉమిక, వి.శ్రీరామ్‌లు (466/470) మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ వెల్లడించారు. వీరితో పాటు 25 మంది విద్యార్థులు 465/470, మరో 46 మంది విద్యార్థులు 464/470 మార్కులు సాధించారన్నారు. బైపీసీలో ఆశ్రేయ మనోజ్, అక్షరరెడ్డి, శశికిరణ్‌రెడ్డిలు 445/440 మార్కులతో మెరిశారన్నారు. వీరితో పాటు 14 మంది విద్యార్థులు 434/470 మార్కులు సాధించారన్నారు. బైపీసీ విభాగంలో విద్యార్థులందరూ 430 పైచిలుకు మార్కులు సాధించాని ఆనందం వ్యక్తం చేశారు. అదే విధంగా సీనియర్ ఇంటర్మీడియట్ విద్యార్థులు కూడా ప్రతిభచాటారన్నారు. ఎంపీసీలో కావ్య అమృత(993), ఎం.కౌశిక్(991), త్రిశాల్(990), బైపీసీలో ఆకాంక్ష(990) మార్కులు సాధించారన్నారు. చాలా మంది విద్యార్థులు 990కిపైగా మార్కులు సాధించడం తమ కళాశాలకు గర్వకారణమన్నారు. శ్రీఅభిద సంస్థ విద్యారంగంలో నాణ్యతకు ప్రతీకగా నిలుస్తుందన్నారు.

దేశ ద్రోహులతో చేతులు కలిపి!

- నకిలీ బర్త్ సర్టిఫికెట్‌ల దందాతో నార్సింగిలో కలకలం
- ఒక్కో సర్టిఫికెట్‌కు రూ. 5 లక్షలు
- రికార్డుల్లో కనిపించని సర్టిఫికెట్‌ల వివరాలు
- ఏడుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు



నిందితుడు సుధీర్‌కుమార్

మణికొండ: కాసులకు కాని పనంటూ ఏదీ లేదని మరోమారు ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు రుజువుచేస్తున్నారు. ఏకంగా మన దేశానికి చెందని వారికి మన పౌరులేనని, ఇక్కడే 25 సంవత్సరాల క్రితం పుట్టారని ధ్రువపత్రాలు జారీ చేస్తున్నారు. దేశంలోకి చొరబాటుగా వచ్చిన వారు స్థానికంగా ధ్రువపత్రాలను సృష్టించుకుని దేశ పౌరులుగా చలామని అవుతూ అనేక దేశద్రోహ కార్యకలాపాలకు పాల్పడుతున్న సంఘటనలు అనేకం వెలుగులోకి వచ్చాయి. అయినా అలాంటి వారికి స్థానికంగా ప్రభుత్వ కార్యాలయాల్లోని కొందరు ఉద్యోగులు కాసులకు కక్కుర్తిపడి ఎలాంటి ధ్రువపత్రాలనైనా జారీ చేసి దేశద్రోహానికి పాల్పడుతున్నారు. ఒక్కో ధ్రువపత్రానికి ఒక్కో రేటును నిర్ణయించి అక్రమార్జనకు పాల్పడిన సంఘటన నార్సింగిలో వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. నార్సింగి మున్సిపాలిటీ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న సుధీర్‌కుమార్‌తో పాటు మరో ఆరుగురిని మలకోపేట పోలీసులు బుధవారం రిమాండ్‌కు తరలించారు.

నిరంతర ప్రక్రియగా...

నార్సింగి మున్సిపాలిటీలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న సుధీర్‌కుమార్ అక్క జీహెచ్ఎంసీ కార్యాలయంలో ఐటీ విభాగంలో పనిచేస్తుంది. ఆమెకు ఉన్న పరపతితో తమ్ముడిని గతంలో చార్మినార్ జోనల్ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పెట్టించింది. అక్కడా ఇలాంటి నకిలీ ధ్రువపత్రాల జారీలో అతని ప్రమేయం వెలుగులోకి వచ్చినా అప్పట్లో కేసుల బారిన పడకుండా తప్పించుకున్నట్టు తెలిసింది. గతంలో నార్సింగి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్‌రెడ్డిని మచ్చిక చేసుకుని అతని ఉద్యోగం నార్సింగికి మార్చుకున్నాడు. గతంలో చార్మినార్ జోన్‌లో ఉన్న సంబంధాలను నార్సింగికి మార్చుకుని ఇక్కడి నుంచే అనేక ధ్రువపత్రాలను జారీ చేసినట్టు చర్చించుకుంటున్నారు. అతని అక్రమాలు నిరంతర ప్రక్రియగా కొనసాగినట్టు మున్సిపల్ అధికారులు అనుమానిస్తున్నారు. ఇతను జారీ చేసిన ధ్రువపత్రాలు మున్సిపల్ రికార్డులలో కనిపించకపోవటం వారికి సవాల్‌గా మారింది. వాటిని ఎలా డిలీట్ చేశారని, అందులో జీహెచ్ఎంసీలో పనిచేస్తున్న అతని అక్క ప్రమేయం ఏమైనా ఉందా అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్ నగరంలో నకిలీ ధ్రువపత్రాలను తయారు చేసే ముఠాలలో సభ్యుడిగా మారిన సుధీర్‌కుమార్ వాటి తయారీ కేంద్రంగా నార్సింగి మున్సిపాలిటీ కార్యాలయాన్ని మార్చుకోవటం చర్చనీయాంశమయ్యింది. అతని కార్యకలాపాలకు అనుగుణంగా ఇటీవలే రూ. కోటికి పైగా ఖర్చుతో నార్సింగిలో ఇంటిని నిర్మించిన ఘటనను ఉదాహరణగా పేర్కొంటున్నారు.

నార్సింగి పోలీసులకు ఫిర్యాదు...

నార్సింగి మున్సిపల్ కార్యాలయం కేంద్రంగా జారీ అయిన నకిలీ బర్త్ సర్టిఫికెట్‌లు వెలుగులోకి ఒకటి, రెండు మాత్రమే వచ్చినా సుధీర్‌కుమార్ మరిన్ని జారీ చేశాడనే అనుమానం మున్సిపల్ శాఖ అధికారులలో ఉంది. దాంతో మరింత లోతుగా విచారణ చేసి అతను జారీ చేసిన అన్ని ధ్రువపత్రాలను వెలుగులోకి తెచ్చి వాటిని రద్దు చేయాలనే ఆలోచనతో ఉన్నారు. దాంతో బుధవారం నార్సింగి మున్సిపల్ కమిషనర్ టి. కృష్ణమోహన్‌రెడ్డి నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. దాంతో రాబోయే రోజుల్లో సుధీర్‌కుమార్ అక్రమాలు మరిన్ని వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని స్థానికులు చర్చించుకుంటున్నారు.